క్లుప్తంగా

పెన్షనర్లకు సత్కారం



పెన్షనర్‌ను సన్మానిస్తున్న పెన్షనర్స్ ఫెడరేషన్ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ 14వ వార్షికోత్సవాన్ని సంఘ అధ్యక్షుడు బొడ్డేటి సూర్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, పంచాయతీ ఈఓ పాత్రో, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ మధుకుమార్ అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భం గా 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ ఏడు మండలాలకు చెందిన 700 మంది పెన్షనర్లకు సంఘం ద్వారా సేవ చేస్తున్నామని తెలిపారు. వక్తలు మాట్లాడుతూ సంఘానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు అందజేస్తున్న గోవిందరాజులు తదితరులు

చీపురుపల్లిరూరల్: పట్టణానికి చెందిన మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 50 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆసంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు మాట్లా డుతూ ప్రతీ ఏడాది మాదిరిగానే ఈఏడాది కూడా పట్టణంలోని రోడ్లపై, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో జీవిస్తున్న నిరుపేదలకు దుప్పట్లు అందజేశామని తెలిపారు. అలాగే ఉచిత ఫుడ్ కోర్టు వద్ద భోజనాలు అందించామని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఏఎస్‌ఐ బి.కామేశ్వరరావు,పతివాడ రాము పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి రజత పతకం



విద్యార్థిని హారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయిని

జామి: మండలంలోని కుమరాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో చదువుకుంటున్న బలరాంపురం గ్రామానికి చెందిన విద్యార్థిని కంచర్ల హారిక రాష్ట్రస్థాయి అండర్ -14 హ్యాండ్‌బాల్ పోటీల్లో రజత పతకం సాధించింది. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లాలో నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి రన్నర్‌గా నిలిచింది. విద్యార్థినిని కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి తదితర ఉపాధ్యాయ సిబ్బంది ఆదివారం అభినందించారు.

దుస్తుల పంపిణీ, అన్నదానం



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, పాస్టర్

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలో యూఆర్‌పీఈఎఫ్ చర్చిలో ఆదివారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. చర్చి పాస్టర్ విజయ్‌కుమార్ నేతృత్వంలో ముందుగా 1,000 మందికి అన్నదానం చేశారు. అనంతరం పాస్టర్ విజయ్‌కుమార్, సర్పంచ్ గాలి సన్యాసయ్య, డోల కేశవ, గొర్లె దేముడు, లగుడు తిరుపతి తదితరులు వంద మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఉద్యోగుల సహకారం అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీఈఏ) జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్–2023ను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఉండాలని కోరారు. సంఘ జిల్లా అ ధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంటి వెంకటరమణ, జిల్లా కోశాధికారి శంకరరావు, ఉ పాధ్యక్షుడు బాలాజీ పాణిగ్రహి, పెన్షన్‌దారుల కార్యవర్గ సభ్యుడు పీవీ రమణ, జిల్లా సంయుక్త కార్యదర్శి సత్తిబాబు పాల్గొన్నారు.



గజపతినగరం: కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అపలనరసయ్య



కొత్తవలస: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కొత్తవలస: రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి బొత్ససత్యనారాయణ, ఎమ్మెల్యేలు



చీపురుపల్లి రూరల్: కేక్ కట్‌చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథులుగా హాజరయ్యారు. మంత్రి బొత్స సత్యనారాయణ కేక్ కట్ చేసి, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల ఎంపీపీలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి, పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణ రాజు, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీ కృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, తాడ్డి వేణుగోపాల్, పొట్నూరు సన్యాసినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసి కేకు కట్ చేశారు. అంతకుముందు స్థానిక పురిటిపెంట లోని ఆంజనేయస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, గజపతి నగరం, దత్తిరాజేరు,బొండపల్లి, గంట్యాడ మండలాల ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక, సింహాద్రి అప్పలనాయుడు, చల్లా చల్లంనాయుడు, పీరుబండి హైమావతి, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపలి, జామి మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాష్, గొర్లె సరయు, గజపతినగరం, జామి మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, గొర్లె రవికుమార్, సీనియర్ నాయకులు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, సురేష్, సంజీవరావు, దేవుడు బాబు, సురేష్, సత్యం అప్పలనాయుడు, నరసింగరావు పాల్గొన్నారు.

కొత్తవలసలో...

కొత్తవలస: కొత్తవలస మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు ఆఫీస్‌లో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుకు కొత్తవలస మండలంతో పాటూ నియోజకవర్గ నాయకులు, ఎల్.కోట జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి,ఎంపీపీ గేదెల శ్రీనివాసరావుకు అధికారులు, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ చల్ల చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడుకు అధికారులు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. పెదమానాపురంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరికి నివాసానికి పలువురు నాయకులు, అధికారులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్ల: ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు దంపతులకు పాలవలసలోని వారి నివాసంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపురంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, సర్పంచ్ శీర విజయలక్ష్మికి మండల అధికారులు మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపికకు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

గంట్యాడ: ఎంపీపీ పీరుబండి హైమావతికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: ఎంపీపీ పొట్నూరు ప్రమీల, సన్యాసినాయుడు దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సచివాలయ సిబ్బంది



కొత్తవలస: ఎల్.కోట జెడ్పీటీసీ వరలక్ష్మికి శుభాకాంక్షలు చెబుతున్న పంచాయతీ కార్యదర్శులు



గంట్యాడ: ఎంపీపీ హైమావతికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



బొండపల్లి: కేక్ తినిపించుకుంటున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



దత్తిరాజేరు: ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడుకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



గజపతినగరం: ఎంపీపీ జ్ఞానదీపికకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



దత్తిరాజేరు: జెడ్పీటీసీ రాజేశ్వరికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



గుర్ల: జెడ్పీటీసీ అప్పలనాయుడు దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న వెలుగు సిబ్బంది

దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ

- రూ.4.40 కోట్లతో చంపావతి నదిపై వంతెన నిర్మాణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న పట్రువాడ గ్రామస్తులు



జోరుగా సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

గజపతినగరం రూరల్:

మండలంలోని గంగచోళ్లపెంట పంచాయతీ పరిధిలోని పట్రువాడ గ్రామ ప్రజల దశాబ్దాల కల ఇన్నాళ్లకు సాకారం కాబో తోంది. గ్రామానికి ఆనుకుని ఉన్న చంపావతి నదిపై వంతెన నిర్మాణానికి రూ. 4.40 కోట్ల ఏపీఆర్‌ఆర్‌పీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇటీవలే ఈ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులను శరవేగంగా చేయిస్తున్నారు. పట్రువాడలో సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అత్యవసరంగా ఆస్పత్రికి పోవాలన్నా, అవసరాల నిమిత్తం గ్రామస్తులు ఇతర గ్రామాలకు, మండల కేంద్రానికి వెళ్లాలన్నా గ్రామాన్ని ఆనుకుని ఉన్న చంపావతి నదిని దాటాల్సిందే. నదిపై వంతెన లేక పోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహించే సమయాల్లో మాత్రం వీరి ఇబ్బందులు వర్ణనాతీతం.

పట్టించుకోని గత ప్రభుత్వం

గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గత ప్రభుత్వంలోని పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. నదిలో నీళ్లు తక్కువగా ఉన్న సమయాల్లో విద్యార్థులు సైతం నదిని దాటుకుని వెళ్లిపోతుంటారని, వర్షాకాలంలో మాత్రం నానా అవస్థలు పడాల్సి వస్తోందని, సమస్యను పలుమార్లు గతంలో ఎంతోమంది నాయకుల వద్ద ఏ కరువు పెట్టినా పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. తాము అధికారంలోకి వస్తే వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్న గత ప్రభుత్వంలోని పాలకులు అధికారంలోకి వచ్చాక ముఖం చాటేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవ తీసుకుని సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. నిర్మాణ పనులు ప్రారంభమై చకచకా సాగుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఊహించలేదు



వంతెన లేకపోవడంతో చంపావతి నదిలో నుంచి రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. వర్షాకాలంలో ఎన్నో రోజుల పాటు ఊరు దాటి బయటికి వెళ్లలేక ఇళ్లల్లోనే ఉండే వాళ్లం. ఇక్కడి చంపావతి నదిపై వంతెన నిర్మాణం నేను బతికుంటుండగా జరుగుతుందని ఊహించలేదు. మా దశాబ్దాల కల ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సాకారమవుతోంది. త్వరలో మా గ్రామస్తులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

– బుగత నారాయణప్పుడు, పట్రువాడ గ్రామం

జూన్ నాటికి పూర్తి చేస్తాం

గంగచోళ్లపెంట పంచాయ తీ పరిధిలోని పట్రువాడ గ్రామానికి వెళ్లే దారిలో చంపావతిపై వంతెన నిర్మాణానికి ఏపీఆర్ ఆర్‌పీ నిధులు రూ.4.40 కోట్లు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇటీవలే శంకుస్థాపన చేసి ఇప్పటికే గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆదిమూర్తి, పీఆర్ జేఈ, గజపతినగరం.

పండగలా పింఛన్ల పంపిణీ

ప్రజలంతా నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటున్న వేళ సామాజిక పింఛన్ లబ్ధిదారులు పెన్షన్ల సంబరాలు నిర్వహించుకున్నారు. పింఛన్ సొమ్ము పెరగడంతో అవ్వా,తాతల ముఖాల్లో చిరునవ్వు వెలిసింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పింఛన్ సొమ్మును మూడు వేల రూపాయల వరకు పెంచుకుంటూ పోతామని హామీ ఇచ్చారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటతప్పకుండా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే రెండు విడతల్లో రూ. 500 పెంచారు. తాజాగా మరో 250 రూపాయలు పెంచడంతో పింఛన్ మొత్తం 2,750 రూపాయలైంది. ఆదివారం ఉదయం పండగ వాతావరణంలో వాడవాడాలా పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల ఉద్యోగులు పాత లబ్ధిదారులతో పాటు నూతన లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

– సాక్షి నెట్ వర్క్



శృంగవరపుకోట: బొడ్డవరలో వృద్ధులకు పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు



కొత్తవలస రూరల్: బలిగట్టంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



గజపతినగరం: పురిటిపెంటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ దిల్షాద్ బేగం



గజపతినగరం: పెంచిన పింఛన్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గుర్ల: కెల్లలో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న సూర్యనారాయణరాజు



దత్తిరాజేరు: చౌదంతివలసలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు



శృంగవరపుకోట: ఎస్.కోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



బొండపల్లి: బి.రాజేరులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ చలం నాయుడు

ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగు



చాటాయవలసలో ఫార్మా మోడల్ విధానంలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ యూనిట్ గుళ్లపాడు క్లస్టర్ పరిధిలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంసహాయక సంఘం సభ్యులకు సంబంధించిన పది సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు ఫార్మా మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద, ఎల్2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూసుబిల్లి రమణ ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 365 రోజులూ ఆకు కూరలు, తీగజాతి, మొక్కజాతి కూరగాయలను నిరంతరాయంగా పండించుకోవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా ఈ పంటలను సాగు చేసుకుంటే రైతులకు నిత్యం రాబడి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల నిరసన ర్యాలీ

రాజాం సిటీ: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని అయ్యప్పస్వాములు కోరారు. ఆదివారం స్థానిక పాలకొండ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి భైరి నరేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్పస్వామి సేవా సమితి జిల్లా అధ్యక్షులు పోరాపు రాము, శివ స్వామి, రాజన్న పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: తెలంగాణకు చెందిన భేరి నరేష్ అయ్యప్పస్వామి, భక్తులను విమర్శించడాన్ని నిరసిస్తూ పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వామి భక్తులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద వారు మాట్లాడుతూ, విపరీత పోకడలకు పోయి హిందూ ధర్మాన్ని అగౌరవపరచడం సరికాదన్నారు. నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గజపతినగరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వ్యక్తులపై అయినా చర్యలు తప్పవని ఎస్‌ఐ గంగరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టామని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట శిబిరాలు, కోడిపందేలు నిర్వహించినా, అక్రమంగా మద్యం రవాణ, గుట్కా, ఖైనీ, గంజాయి రవాణాకు ఎవరైనా పాల్పడినట్లు తెలిస్తే తక్షణమే 91211 09459 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

నెల్లిమర్ల: సతివాడ పంచాయతీ పరిధిలోని ఎంబేరయ్యగుళ్ల గ్రామంలోనున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శన భాగ్యం కల్పిస్తామని సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.